# ఇంట్లో విరహం

నాటకానికి వెళ్ళి వచ్చాను. నాటకంలో నాయికా నాయకులు ఒకరినొకరు ప్రేమించుకొంటారు. ఒకరినొకరు వదలి ఉండలేరు.

తరువాత ఎడబాటు కలుగుతుంది. నాయిక విరహ తాపం అనుభవిస్తుంది. ముత్యాలహారాలు తెంపి పోస్తుంది. తుమ్మెదలనూ, కోవిలలనూ తిడుతుంది. చంద్రదూషణ చేస్తుంది. వెన్నెల వేడి భరించలేక బాధపడుతుంది. తాపజ్వరంలో సొమ్మసిల్లిపోతుంది. మన్మథుడ్ని దూరుతుంది. దాసీలు పన్నీరు చల్లి మూర్ఛనుండి ఆమెను లేవనెత్తుతారు.

అటు తరువాత నాయకుడు రావటం అతన్ని అమాంతం తన కౌగిట్లో నలిపి చేయటం, ముద్దులు కురిపించటం జరుగుతుంది.

ఇవన్నీ చూశాను ఆ రాత్రంతా అదే ఆలోచన, జీవితం యొక్క మాధుర్యం అంతా అట్లా ప్రియురాలు ప్రవర్తించటంలలో ఉందనుకొన్నాను. అటువంటి అనుభవాలు లేకపోతే జీవితం నిష్ఫలం అనుకొన్నాను నా జీవితంలో అటువంటి అనుభవం కొంత కలపాలని నిశ్చయించుకొన్నాను.

ఇటువంటి రసానుభవానికి నేను నాయకుడ్ని, కాంతం నాయిక అయినాము. అయితే కాంతానికి ఇటువంటి నాయికా లక్షణాలు నేర్పటం ఎట్లా ? అదో పెద్ద చిక్కు.

నేను లేనప్పుడు విరహం అనుభవించు. చంద్రుడ్ని తిట్టు. వెన్నెల వేడి అను. కోవెలనూ తుమ్మెదనూ తిట్టు. మెళ్ళో హారాలు, హారాలు తేకపోతే ఏముంటే అదే, తెంపి పోయి అని చెప్పితే కాంతం వింటుందా ? వినటం మాట అట్లా వుంచి నాకు ధైర్యం ఏది?

కాబట్టి ఒక నాటకం చూపిస్తే, ప్రియుడు లేనప్పుడు విరహం అనుభవించాలని తెలుస్తుంది అది ఊహించి, మర్నాడు 'కాంతం, ఈ రోజు పెందలాడే వంటచెయ్యి, పిల్లలను మా అమ్మ కప్పచెప్పి మనం నాటకానికి వెడదాము' అన్నాను.

"నాటకానికి నేనెందుకులెండి. నాకు ఇంట్లో నాటకం చాలు, మీరు వెళ్ళండి సరదాగా ఉంటే" అన్నది కాంతం పెద్దపిల్లకు తల దువ్వుతూ.

"నేను కూడా నాటకానికి వస్తానాన్నా" అన్నది పెద్దపిల్ల.

ఆ మాటలు వింటూ ఉన్న చిన్నది తేలుకుట్టినట్లు కెవ్వున కేకేసి ఏడ్వటం మొదలుపెట్టింది. పెద్దవాడు తన సంబంధం లేకుండా ఏమిటో జరిగిపోతున్నదని అనుకొని కామాలు చిందులు తొక్కటం ప్రారంభించాడు. 'చూశారా ? నాటకం, మనకు వేరే నాటకం ఎందుకు ?' అన్నది కాంతం. గులాబి రేకులవంటి చెక్కిళ్ళపైన గుంటలు పడేటట్లు నవ్వుతూ.

"నీకెందుకు నీవు వంట చెయ్యి" అన్నాను కాంతంతో 'మనమంతా వెళ్ళుదాములే అమ్మా' అని పిల్లలతో అన్నాను.

రాత్రికి అందరం పెందలాడే భోజనం చేశాము. చిన్న పిల్లలందరూ నాటకం మరచిపోయి నిద్రపోయినారు. పెద్దది మేకులాగ కూర్చున్నది. నాటకానికి వెడదామని, కాంతాన్ని బలవంతం మీద కదలించుకొని తీసికెళ్ళేసరికి మంగళగిరి రథాన్ని కదిలించినంతటి ప్రయత్నమైంది.

**- 2 -**

ఎట్లాగయితేనే, కాంతానికి నాటకం చూపించి తీసుకొస్తున్నాను. ఇక ప్రేమతత్వం మెల్లగా బోధిద్దామని 'సత్యభామకు కృష్ణునిమీద ఎంత ప్రేమో చూశావా' అన్నాను. ప్రేమ ఉండదా, అబ్బురమా' అన్నది కాంతం.

'భర్త రాక ఆలస్యమయితే ఎంత పరితపించిందో చూశావా ?' అన్నాను.

"నాటకం కాదూ, నాటకాల్లో అంతే" నన్నది కాంతం.

"ఆ కాస్త ఎడబాటుకే ఓర్వలేక చంద్రుడ్ని తిట్టి కోవిలను దుమ్మెత్తిపోసి "కళ్ళ కాయలు కాసినా" యని కీర్తన పాడింది. చూశావా అన్నాను.

'కీర్తన బాగానే ఉంది' అన్నది కాంతం.

'కీర్తన బాగుండటం కాదు. భర్తయందు ప్రేమ ఎట్లు చూపిందో చూశావా' అన్నాను.

"అవును చూశాను, కాని ఏమిటా వెధవ చేష్టలు, హారాలు తెంపిపోసుకొని శుభ్రమైన పూలన్నీ నలగగొట్టుకొని వెధవ గందరగోళం అంతా చెయ్యకపోతే ప్రేమ లేనట్లా ఏమిటి" అన్నది.

"అదికాదు, ప్రేమ ఉన్నవాళ్ళు ఎడబాటుకు మాత్రం ఓర్వలేరు. వాళ్ళకు వెన్నెల చల్లగా ఉండదు. వేడిగా ఉంటుంది. కోవిలపాట అసహ్యంగా ఉంటుంది" అన్నా.

"చూడండి, ఇదంతా పుస్తకాల్లో గోలేగాని నిజానికి కోయిల కూత, పెద్దపాటనూ, అందులో హాయినా ?"

"అల్లాకాదు. అల్లా ఉండాలె. భర్త వియోగం కలిగినపుడు మాసిన చీర కట్టుకోవాలె. స్త్రీకి భర్త లేనపుడు తన శరీరంమీద తనకే అసహ్యం కలుగుతుంది. అల్లా ప్రవర్తిస్తేనే ప్రేమ చూపటం" అన్నాను. కాంతం బడి కుర్రవాడి లాగ, నేను చెబుతుంటే విని ఊరుకొంది.

**- 3 -**

మర్నాడు కాంతానికి విరహబాధ కలుగజేసి రాత్రి చెప్పిన విషయాలు కాంతం ప్రవర్తనలో ఎట్టి మార్పును నూతనత్వాన్ని, తీసుకొస్తవో చూద్దామని అనుకొన్నాను. అందుకని "కాంతం! నేను ఊరికెడుతున్నాను. సాయంత్రం పదిగంటలదాకా రాను" అన్నాను.

"వెళ్ళక పోతే నేమి ? సెలవొస్తేసరి, ఎక్కడికో ఒక అక్కడికి దయచేస్తారు. కాళ్ళు నిలవవు ఇంట్లో" అన్నది కాంతం.

"నేను వెళ్ళటం నీ కిష్టం లేదా" అన్నాను.

"ఏమాత్రం ఇష్టం లేదు" అన్నది కాంతం.

ప్రియుని ఎడబాటుకు సహించలేదన్నమాట, అని నాకు నేను చెప్పుకుని సంతోషించి, కాంతానికి వియోగం కలుగజేసి పూర్తిగా సత్యభామలాంటి దాన్నిగా తయారు చేద్దామని సంకల్పించుకొని వెళ్ళిపోయినాను.

సెలవురోజు హాయిగా ఇంట్లోబడి నిద్రపోకుండా ఇదోటి రావటంమూలాన,

స్నేహితుల యిండ్లలోనూ కాఫీ హెూటల్‌లోను క్లబ్బులోను కాలంగడపటం కష్టమైనా ఉత్కృష్టమైన కార్యాన్ని సాధించుటకొరకు తాత్కాలికమైన చిన్న కష్టాలను లెక్కచేయగూడదని అనుకొన్నాను.

పగలు గడిచింది. రాత్రి తొమ్మిది దాకా ఎక్కడుండేది చలికాలంలో ? ఇదో చిక్కు ఏదైనా ఒక మంచి పని చేయాలంటే చిక్కులురావూ మరి. ఆ మాత్రానికి లొంగిపోగూడదని నిశ్చయించుకొని సినీమాకు వెళ్ళి తొమ్మిదిన్నర దాకా అక్కడ గడపి, అప్పుడు యింటిదారిపట్టాను.

కాంతం విరహ బాధ, వియోగ వేదన ఏమైనా పడుతూ ఉంటుందా అని ఆలోచనలోకి దిగాను. నాటకంలో చూచిందాయె. నేను చెప్పిన విషయాలు విన్నదాయె, ఇక కాకపోతే హంస తూలికా తల్పము లేదు. కాబట్టి చిరిచాప మీదనే శయనించి, అంత ఘోరంగా చంద్రదూషణ చేయక పోయినా కాస్త విచారపడుతూ అయినా ఉ ండదా అనుకొంటూ ఇంటి కొచ్చాను.

తలుపు వేసి ఉంది. తలుపుదగ్గర వెళ్ళి తలుపు, తలుపు అన్నాను. ఆపళంగా అమాంతంగా రావటం, గాఢాలింగనంచే ప్రియుడ్ని తృప్తిపరచటం జరిగితే బాగుంటుందను కొన్నాను. ఎంతసేపటికి తలుపు తియ్యదు. బైట వెధవ చలిగాలి, ఏమబ్బా కాంతం ప్రణయం చూపటం లేదు అనుకొన్నాను. ఇంతలో నాయిక ప్రణయకోపంలో తలుపు తీయకపోవటం కూడా కద్దు అని జ్ఞాపకం వచ్చి “ఓహెూ ! అదిగామాలు ఇది” అని అనుకొని కొంచెం సంతోషించినాను. కాని ప్రణయ కోపమైనా ఇట్టె పోవాలె, లేకపోతే మగాడికి కష్టం సుమండీ. వెధవ చలి వణుకొస్తుంది. నిజంగా సత్యభామలాగ ప్రణయ కోపం అట్టే పట్టిందా చచ్చానే అని అనుకొంటూ ఉండగానే వచ్చి తలుపు తీసింది కాంతం.

కాంతాన్ని చూచేసరికి కడుపు చెరువై పోయింది. వియోగబాధవల్ల కుమిలిపోయిన మనిషి అల్లా ఉంటుందీ తెల్లని చీర కట్టుకొని పూలు పెట్టుకొని, శు భ్రంగా.

తెగిపోయినా పూలహారాలు ఏవీ ? మెడలో ఉన్న ఆ ఒక్కగొలుసూ, తెగకుండానే ఉంది.

ఛీ ! నేను చేసిన ప్రయత్నం అంతా వ్యర్థం అయింది అనుకొన్నా, నమిలి మింగేద్దా మన్నంత కోపం వచ్చింది. కాని దిగమ్రింగికొని.

"నా రాకకోసం పాపం ఎదురు చూస్తున్నావు కాబోలు" అన్నా.

"ఎదురు చూడటం ఎందుకు ఊరికెళ్ళిన వాళ్ళు రాక పారిపోతారా ?"

"అది గాదే, నీకు భర్తృవియోగం కలుగలేదూ ?" అన్నాను.

"కలిగితే నేం."

"కలిగితే విరహతాపం పుట్టాలె."

"నా కర్మం. నీకు పుట్టక పోవటం నాయందు నీకు ప్రేమ లేదన్నమాట. సత్యభామకు ప్రేమ ఉన్నది కాబట్టి అట్లా పుట్టింది ఆమెకు" అన్నాను !

"దానికేం వచ్చిందో పిల్లాజెల్లా లేని ముండలకేముందీ అయినా ఏమిటీ గోల ?"

నా మీద నీకు ప్రేమ లేదన్నమాటే కదూ ?" అన్నాను దీనంగా.

"మహా బాగా కనిపెట్టారు మధ్యాహ్నం పాపం ఫలహారం చేశారోలేదో, అన్నంతిందాముదండి, అల్లం పచ్చడి చేశాను ..... తరువాత మాట్లాడదాం" అన్నది.

భోజనం అయినతరువాత కాస్తనయమేనా పైత్యం ?" అన్నది కాంతం తమలపాకులకు ఈనెలు తీస్తూ, కానీ అప్పటికి నాకొకటి తోచింది మనం ఆట్టే ఈ విరహం గిరహం ఆమె బుర్రలోకి ఎక్కిస్తిమా అంటే ప్రణయకోపాలు నిజంగా వచ్చినాయా, చలిలోను ఎండలోనూ వానలోను బైటపడి ఉండటం జరుగుతుందని జ్ఞాపకానికి వచ్చింది. అది కాక ఆకలితో మాడిపోతూ నేను ఇంటికొస్తే, అపుడు వెంటనే ఇంత పచ్చడి అన్నం పెట్టింది. హాయిగా తిన్నాను. విరహమూ అవీ నేర్పామా అంటే చావే అని అనుకొని అయినా కాంతంతో బింకానికి "నీకు నిజమైన ప్రేమ ఉంటే భర్త వియోగం కోసం దుఃఖపడుతూ ఉండవా !" అన్నాను.

"చాలు చాలులెండి" నాటకాలకు వెళ్ళొద్దంటే వినరుగా ? చెపుతాను జరగండి" అన్నది కాంతం.